క్లుప్తంగా

వేరుశనగ క్వింటాల్ రూ.7,729

జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం వేరుశనగకి గరిష్ఠంగా రూ.7,729, కనిష్ఠంగా రూ.4,066 ధరలు లభించాయి. అదేవిధంగా మొక్కజొన్నకు గరిష్ఠంగా రూ.2,222, కనిష్ఠంగా రూ.2,185, కందులు గరిష్ఠంగా రూ.7,899, కనిష్ఠంగా రూ.7,839, పత్తి గరిష్ఠంగా రూ.7,299, కనిష్ఠంగా రూ.5,001, పెబ్బర్లు గరిష్ఠంగా రూ.5,655, కనిష్ఠంగా రూ.4,929 ధరలు లభించాయి.

■ దేవరకద్ర మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన ఈనామ్ టెండర్లలో ఆముదాల ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.6,228, కనిష్ఠంగా రూ.6,202గా నమోదయ్యాయి. సీజన్ లేక పోవడం వల్ల కేవలం ఆముదాలు మాత్రమే అమ్మకానికి వచ్చాయి.

మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ



మహమ్మదాబాద్: నర్సరీల్లో మొక్కల సంరక్షణపై తగిన చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఓ యాదయ్య తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని నర్సరీ, పల్లెప్రకృతి వనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె ప్రకృతివనాల్లో మొక్కలకు ఎన్‌ఆర్ ఈజీఎస్ నుంచి కూలీలు, ట్యాంకర్ల ద్వారా నీళ్లు అందించాలని తెలిపారు. సర్పంచ్‌లతో కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, ఎఫ్ఏ బచ్చయ్య తదితరులు ఉన్నారు.

కందూర్ ఆలయ హుండీ లెక్కింపు



అడ్డాకుల: మండలంలోని కందూర్ శివారులో స్వయంభూగా వెలిసిన శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద బుధవారం హుండీ లెక్కింపు చేపట్టారు. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వీణాధరి, ఈఓ రాజేశ్వరశర్మ, ఆలయ చైర్మన్ రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో హుండీ లెక్కించారు. రూ.4.18లక్షల ఆదాయం సమకూరిందని ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఉద్యోగి అనంతసేన్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ తనిఖీ



మిడ్జిల్: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని బుధవారం మండల విద్యాధికారిణి మంజులాదేవి తనిఖీ చేశారు. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన కొనసాగించాలని సూచించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు.

3 ఇసుక టిప్పర్ల పట్టివేత

అడ్డాకుల: మూసాపేట మండలం పోల్కంపల్లి శివారులోని పెద్దవాగు నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడు టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ నరేష్ బుధవారం తెలిపారు. రెవెన్యూ అధికారులు, పోలీసులు కలిసి వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని న్యూప్రేమ్‌నగర్‌లో గత నెల 26వ తేదీ నుంచి పోచమ్మ, మైసమ్మ విగ్రహాలు, బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ప్రతిష్ఠాపన ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఉదయం గణపతి పూజ, పంచామృతం, నారికేళ అభిషేకం, గోపూజ, రుద్రాభిషేకం, హోమాలు చేశారు. సాయంత్రం వందలాది సంఖ్యలో మహిళలు బోనాల ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో డోలు వాయిస్తూ చేసిన నృత్యాలు అలరించాయి. మహోత్సవాల్లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సతీసమేతంగా పాల్గొని పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రతీక బోనాల పండుగ అని అన్నారు. ఒకప్పుడు ఇరుకైన రోడ్లు, సరైన మౌలిక వసతులు లేక ప్రేమ్‌నగర్ అధ్వాన్నంగా ఉండేదని, ఇప్పుడు సువిశాలమైన రోడ్లతో సుందరంగా రూపుదిద్దుకున్నదని తెలిపారు. భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ గంజి వెంకన్న, కౌన్సిలర్లు కిషోర్ కుమార్, బాలీశ్వరమ్మ పాల్గొన్నారు.

■ మహబూబ్‌నగర్ మండలం మాచన్‌పల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మంత్రి శ్రీనివాస్‌గౌడ్ బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులు నాణ్యతగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు.



ఊరేగింపులో డప్పు వాయిస్తున్న కళాకారుడు



వేడుకల్లో పాల్గొన్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

లక్ష్మీహయగ్రీవ ఆలయంలో పూజలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలో గల వెంకటేశ్వరకాలనీలోని లక్ష్మీహయగ్రీవ ఆలయంలో బుధవారం కర్ణాటక రాష్ట్రం మైసూర్ శ్రీవాగీష బ్రహ్మతంత్ర పరకాల మఠస్వామివారు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో స్వామివారు విశేష ఆరాధనలు నిర్వహించారు. పరకాల మఠం చాలా ప్రాచీన మఠమని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. గురువారం విశేష ఆరాధనలు నిర్వహిస్తారని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ ప్రతినిధులు రాఘవాచార్యులు, మోహనకుమార్, గోపాలకృష్ణ తెలిపారు.



పూజలు నిర్వహిస్తున్న పరకాల మఠం స్వామి

క్రీడలతో మానసికోల్లాసం

జడ్చర్ల: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక స్టేడియం మైదానంలో సీఎల్‌ఆర్ క్రికెట్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన బ్యాట్ పట్టుకుని క్రికెట్ ఆడి అక్కడివారిని ఉత్సాహపరిచారు. యువత క్రీడల్లో పాల్గొనడం వల్ల ఆరోగ్యంతో పాటు కొంత ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, మార్కెట్ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు పోరాటం



పాలమూరు యూనివర్సిటీలో నివాళులర్పిస్తున్న ఎంఎస్ఎఫ్ నాయకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎస్సీ వర్గీకరణ కోసం 28ఏళ్లుగా ఎన్నో పోరాటాలు చేస్తున్నామని ఎంఎస్ఎఫ్ పీయూ అధికార ప్రతినిధి గణేష్ మాదిగ పేర్కొన్నారు. ఈ పోరాటంలో అసువులు బాసిన మాదిగ అమరవీరులను స్మరిస్తూ వారికి బుధవారం పీయూ మెయిన్ గేట్ వద్ద ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరాజ్ మాదిగ, టీవీఎస్ జేఏసీ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చైర్మన్ బత్తిని రాము, పీయూ మహిళా విద్యార్థి నాయకురాలు శ్రీవిద్యగౌడ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మారుతి, జేఏస్‌యూ వ్యవస్థాపక అధ్యక్షుడు మోనేష్, ఎంఎస్ఎఫ్ పీయూ నాయకులు సుభాష్, శేఖర్, సుధాకర్, గోపాల్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో..

మహబూబ్‌నగర్ రూరల్: ఎస్సీ వర్గీకరణ పోరాటంలో అసువులు బాసిన మాదిగ అమరవీరులకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నివాళులర్పించారు. స్థానిక తెలంగాణ చౌరస్తాలో మాదిగ అమరవీరుల చిత్రపటాలకు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెపోగు శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధన కోసం 28 ఏళ్లుగా మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలు అనేక ఉద్యమాలు చేసినా పాలకులకు పట్టింపులేదని అన్నారు. నమ్మించి మోసం చేసిన బీజేపీకి మాదిగలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసే వరకు పోరాడుతామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జయన్న, రావుల కృష్ణ, ఎల్లప్ప, యాదగిరి, రాజు, సాయి, నరేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..

ఎమ్మార్పీఎస్ మాదిగ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ చౌరస్తాలో మాదిగ అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో పి.బాలయ్య, ఎం.వెంకటస్వామి, రాములు, బాలరాజు, కావలి కృష్ణయ్య, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీవర్గీకరణ సాధించడమే..

జడ్చర్ల టౌన్: ఎస్సీవర్గీకరణ సాధించడమే ఉద్యమంలో మృతిచెందిన వారికి నిజమైన నివాళులర్పించటం అవుతుందని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ జంగయ్యమాదిగ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో వర్గీకరణ ఉద్యమంలో మృతిచెందిన వారికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రాజు, శ్రీనివాస్, యాదయ్య, జంగయ్య, భీంరాజ్ పాల్గొన్నారు.

మిడ్జిల్: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం అసువులు బాసిన మాదిగ అమరవీరులకు మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో సురేష్, వెంకటయ్య, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిపై దాడి అప్రజాస్వామికం

చిన్నచింతకుంట: టీపీసీసీ ప్రసిడెంట్ రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నాయకుల దాడి అప్రజాస్వామికమని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అన్నారు. వరంగల్ జిల్లా భూపాలపల్లి నియోజకవర్గంలో రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నాయకులు దాడిని ఖండిస్తూ బుధవారం మండల కేంద్రంలో రాస్తారోకో చేపట్టారు. సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. పాదయాత్రకు పెరుగుతున్న ప్రజాదరణను చూసి బీఆర్ఎస్ గుండాలు దాడులకు పాల్పడడం సిగ్గుచేటన్నారు.

అడ్డాకుల: భూపాలపల్లిలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నాయకులు దాడి చేయడాన్ని టీపీసీసీ కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ ఖండించారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు తిరగబడితే బీఆర్ఎస్ నాయకులు కనుచూపు మేరలో కూడా కనిపించరని హెచ్చరించారు. అక్కడి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ పార్టీ ఫిరాయించడమే కాకుండా గెలిపించిన పార్టీపైనే దాడికి ఉసిగొల్పడం సమంజసం కాదన్నారు. బీఆర్ఎస్ నాయకులు మరోసారి తమ పార్టీ నాయకులపై దాడికి పాల్పడితే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. సమావేశంలో వేణుగోపాల్, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షఫీఅహ్మద్, టీసీ శ్రీనివాస్, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి

ఓటమి భయంతోనే దాడులు..

స్టేషన్ మహబూబ్‌నగర్: వచ్చే ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై టీఆర్ఎస్ నాయకులు దాడులు చేశారని మహబూబ్‌నగర్ అసెంబ్లీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జె.చంద్రశేఖర్ అన్నారు. రేవంత్‌రెడ్డిపై దాడులకు నిరసనగా మహబూబ్‌నగర్ అసెంబ్లీ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్ యాదవ్, రాములు యాదవ్, రాఘవేందర్, రమేష్ నాయక్, కురువ నరేష్, శంషొద్దీన్, మహ్మద్ పాల్గొన్నారు.

బసవేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



ఆలయంలో ఉన్న నంది విగ్రహం

నవాబుపేట: మండలంలోని మరికల్, కిష్టంపల్లి పరిధిలో గల కోటచింతల బసవేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. దాదాపుగా 400 ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయం పరిసర ప్రాంతాల్లో ముత్యాలు, పగుడాలు, నల్లపూసలు లభిస్తాయి. కొత్తగా పెళ్లైన జంటలు ఇక్కడికి వచ్చి ఆలయ పరిసర ప్రాంతాల్లో ముత్యాలు, పగుడాలు, నల్లపూసలను తాళిబొట్టుతో పాటు అల్లుకుని ధరించడం వల్ల మంచి జరుగుతుందని విశ్వాసం. ఆలయంలో మహానంది విగ్రహం ఉండేది. రెండేళ్ల కిందట గుప్తనిధుల కోసం దుండగులు ధ్వంసం చేశారు. మహానంది విగ్రహాన్ని ధ్వంసం చేయడంతో ఆ స్థానంలోనే భారీ మహానంది విగ్రహాన్ని మరికల్ గ్రామస్తులు ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తున్నారు.

ఉత్సవాలు ఇలా..

బసవేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం మరికల్ నుంచి దేవతామూర్తుల ఊరేగింపు, 3వ రుద్రాభిషేకం, అగ్నిగుండ మహోత్సవం, 4న శకటోత్సవం, 5న మహా మంగళహారతి, శివపార్వతుల కల్యాణం ఉంటుంది. అగ్ని గుండం రోజు వీరశైవులు అగ్నిలో నడుస్తూ తమ భక్తిని చాటుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడికి వస్తారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ భజనలు, సేవ, హరికథ, పౌరాణిక నాటికల కళాకారులచే కార్యక్రమాలు ఉంటాయని మరికల్ సర్పంచ్ పాండు, కిష్టంపల్లి సర్పంచ్ శ్రీనివాస్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉత్సవ కమిటీ నిర్వాహకులు రాజేష్, ఉదయ్, పూజారి మఠం సిద్ధయ్య వెల్లడించారు.



కోటచింతల బసవేశ్వరస్వామి ఆలయం

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

అడ్డాకుల: మండలంలోని కందూర్‌కు చెందిన జంగం మైబు అనారోగ్యానికి గురై మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని బుధవారం జెడ్పీటీసీ ఎన్.రాజశేఖర్‌రెడ్డి పరామర్శించారు. మృతుడి భార్య మణెమ్మకు అంత్యక్రియల కోసం రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. బీఆర్ఎస్ నాయకుడు కారెడ్డి దేవేందర్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేసి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.

యువత పాత్ర కీలకం

నవాబుపేట: శాంతిభద్రతల పరిరక్షణలో యువత పాత్ర కీలకమని ఎస్ఐ పురుషోత్తం అన్నారు. బుధవారం మండలంలోని యన్మన్‌గండ్లలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో యువత సామాజిక బాధ్యత ఉన్న పోలీసులాంటి వారని, శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసులకు సహకరించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ జయమ్మ, హన్మంత్, ఉపసర్పంచ్ రఘు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తిని చాటాలి..

అడ్డాకుల: క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని టీపీసీసీ కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.

నిరుపేద మహిళకు ఇల్లు అప్పగింత

బాలానగర్: భర్త చనిపోయి, కూతురు చదువు భారంగా మారి, ప్రభుత్వం కట్టించిన మరుగుదొడ్డిలోనే కూతురుతో కలిసి మండలంలోని సూరారంలో నివాసం ఉంటున్న అరుణమ్మకు జర్నలిస్టు అండగా నిలిచారు. సామాజిక మాధ్యమాల ద్వారా విషయం తెలుసుకున్న జర్నలిస్టు మల్లన్న రూ.2.5లక్షల వ్యయంతో ఇంటి నిర్మాణం చేయించి బుధవారం మహిళతో గృహ ప్రవేశం చేయించారు.

ప్రజా సమస్యలపై మార్నింగ్ వాక్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు చిన్నదర్పల్లి కౌన్సిలర్ లతశ్రీ సమస్యలపై దృష్టి సారించారు. చిన్నదర్పల్లిలోని తెలుగుగేరి, పూజారి తండాల్లో బుధవారం మార్నింగ్ వాక్‌లో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలపై ఆరా తీశారు. పూజారి తండాలో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు చందర్‌నాయక్, జగన్మోహన్‌గౌడ్, నాగరాజు, రమేశ్‌నాయక్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మల్లలమ్మ ఉత్సవాలు

జడ్చర్ల: మండలంలోని నాగసాల గుట్ట కిష్టంపల్లి సమీపంలో మల్లలమ్మ మహోత్సవాలను గురువారం నుంచి 5వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, 5న బోనాలు, ఊరేగింపు తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

‘అర్హులందరికీ ఉపకార వేతనాలు’

గండీడ్: అర్హులైన విద్యార్థులందరికీ ఉపకార వేతనాలు అందేలా తగిన చర్యలు తీసుకోనున్నట్లు మండల ప్రత్యేకాధికారి బాబురావు తెలిపారు. బుధవారం ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, తహసీల్దార్లతో ఆయన సమావేశమయ్యారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఇతర సమాచారాన్ని పకడ్బందీగా సేకరించి అర్హులందరికీ ఉపకార వేతనాలు అందేలా కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి, తహసీల్దార్లు జ్యోతి, ఆంజనేయులు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ట్రై సైకిల్ ఇప్పించండి సారూ..



కలెక్టర్‌కు సమస్య వివరిస్తున్న దివ్యాంగుడు సత్యయ్య

దేవరకద్ర: నడవలేని స్థితిలో ఉన్నాను.. ఆర్థిక పరిస్థితి కూడా బాగా లేదని.. తనకు వీల్ ట్రై సైకిల్ ఇప్పించాలని మండలంలోని అడవి అజిలాపూర్‌కు చెందిన దివ్యాంగుడు సత్యయ్య కలెక్టర్ రవిని వేడుకున్నారు. బుధవారం కలెక్టర్ మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మిక తనిఖీ అనంతరం తిరిగి వెళ్తుండగా, వీల్ చైర్‌పై అక్కడికి వచ్చిన సత్యయ్య తన గోడు చెప్పుకున్నాడు. వీల్ చైర్‌ను ఎవరైనా తోసుకుంటూ రావాల్సి ఉంటుందని, ట్రై సైకిల్, మూడు చక్రాల స్కూటీ అయితే సొంతంగా తిరిగేందుకు అవకాశం ఉంటుందని తెలిపాడు. మండల పరిషత్‌లో దరఖాస్తు చేసుకుంటే ట్రై సైకిల్ మంజూరు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

ప్రశ్నించే గొంతుకను గెలిపిద్దాం



మాట్లాడుతున్న శాంతి

మహమ్మదాబాద్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుకకు ఓటు వేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శాంతి తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం అభ్యర్థి పాపన్నగారి మాణిక్ రెడ్డి తరపున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం మహమ్మదాబాద్, గండీడ్ పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఎన్నో సమస్యలు ఉన్నా పట్టించుకోవడం లేదని తెలిపారు. యూటీఎఫ్ అభ్యర్థిని గెలిపించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు ఉమాదేవి, తిరుపతమ్మ, జయంతి, రాజేశ్వరి, శ్రీనివాస్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో బీజేపీదే అధికారం

పాలమూరు: జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన కార్నర్ సమావేశాలు విజయవంతం అయ్యాయని మాజీ మంత్రి పి.చంద్రశేఖర్ అన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడం జరిగిందని, దీంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపినట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో తప్పక బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నట్లు వెల్లడించారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి

మహబూబ్‌నగర్ రూరల్: అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ సీఐటీయూ అనుబంధం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సీడీపీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర నాయకుడు కిల్లెగోపాల్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తుందని అన్నారు. బడ్జెట్‌లో ఐసీడీఎస్‌కు తక్కువ నిధులు కేటాయిస్తూ టీచర్లకు, ఆయాలకు నష్టం వాటిల్లే చర్యలు తీసుకుంటుందని అన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనాలు అమలు చేయకుండా వెట్టిచాకిరి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయించుకుంటున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పుష్పలత, సీఐటీయూ నాయకులు చంద్రకాంత్, రాజ్‌కుమార్, భరత్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర: సమస్యలు పరిష్కరించాలని బుధవారం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి వచ్చిన అంగన్‌వాడీలు స్థానిక మార్కెట్‌యార్డు నుంచి ర్యాలీ నిర్వహించారు. కోయిల్‌సాగర్ రోడ్డులో ఉన్న ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం అధికారి శైలశ్రీకి వినతిపత్రం అందజేశారు. అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయం చేరుకుని దిగ్బంధం చేసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, రాజ్‌కుమార్ మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సీఐటీయూ అండగా ఉంటూ ఉద్యమిస్తుందని తెలిపారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వరలక్ష్మి, పద్మ, మల్లేశ్వరి, గోవిందమ్మ, లక్ష్మి, రాణి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దీప్లానాయక్ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు బుధవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ ధర్నా చేపట్టారు. అంతకుముందు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య, జగన్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ సభ్యులు ప్రభావతి, సరోజ, ముహెమూదా ,రాజ్యలక్ష్మి, గౌసియాబేగం, నాగమ్మ, బాలామణి తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలోని సీడీపీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



దేవరకద్రలో..



జడ్చర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది